రాస్తారా లేక పత్రికా కార్యాలయాల్లో అవి ప్రచురింపబడతాయా అని సందేహించవలసి వస్తుంది. ఉన్న చోటులోనే వీలయినన్ని ఎక్కువ ఉత్తరాలు ప్రకటింపబడాలనే తహ తహ కొద్దీ సంపాదకులు ఉత్తరాల్ని కత్తిరించి కత్తిరించి అచ్చువేస్తారు. కొన్ని పత్రికలు కేవలంఏకవాక్య జనవాక్యాలనే అచ్చువేస్తాయి. ఒక పాఠకుడు ప్రశ్నిస్తాడు. "కొరియా యుద్ధం ఎందుకు జరుగుతోంది?" అని. అంతే ఉత్తరం అంతాకలిపి.

ఇంకోపాఠకుడు విసుక్కుంటాడు;"ఫలాని రాజకీయవేత్త యింకా ఎందుకు బతికి ఉన్నాడు?" అని.

ఆ మధ్య అమెరికా పత్రిక ఒక దానిలో ఒకలేఖ ప్రచురింపబడింది. దాని సారాంశం యిది: రాత్రి తొమ్మిదిగంటల వేళ గృహస్థు యింటికొచ్చి భార్యతో ముచ్చటగా కాలక్షేపంచేసే ఘడియల్లో పక్కనే రేడియో లోంచి అంతర్జాతీయ వార్తలు వినిపిస్తే ఎలాగ ఖర్మ. ఉల్లాసకరమైన శృంగార సంగీతం వినిపించాలిగాని. అదీ ఉత్తరం. అతడి పడకటింటి సమస్య మనంకూడా దేశసమస్యగా భావించాలని అతడి ఉద్దేశ్యం.

మొత్తంమీద బహిరంగలేఖల శీర్షిక ఒక రచ్చసావిడి. సమాజ జీవితంలోని ఎత్తు పల్లాలూ, సుఖదుఃఖాలూ అందులో ప్రతి ఫలి స్తూంటాయి. ఇక్కడ గమనించదగిన విషయ మేమిటంటే, సంపాదకుడి చిత్తు కాగితాల బుట్టలో పడిపోగా మిగిలినవే యింత ఆహ్లాద కరంగా ఉంటే, ఇక అచ్చుపడనివి ఎంతచరిత్ర చెప్పగలిగేవిగా ఉంటాయోనని! ఈ సత్యాన్ని గ్రహించి కేవలం బహిరంగలేఖల ప్రచురణ కోసమే ఒక పత్రిక స్థాపించినట్లయితే దిగ్విజయంగా ఉండొచ్చు. అటువంటి పత్రిక బయల్దేరినా మనం ఆశ్చర్యపడ నక్కరలేదు. ఇది ప్రజాస్వామ్య యుగం.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

# కొత్త రకం పెళ్లికొడుకులు

"అమరశ్రీ"

పెళ్లి చేసుకోననటం ఈమధ్య ఒక 'ఫాషన'యి పోయింది. మన ప్రాంతాలలో ప్రత్యేకంగా కాలేజీ విద్యార్థులలో ఇది బాగా ప్రబలి పోయింది. ఏకాలేజీ విద్యార్థిని కదిలించినా పెళ్ళి చేసుకోననేవాడే.

"వచ్చే సంవత్సరం పెళ్ళి చేసుకుంటావు కాబోలు" అంటే,

"మనకి పెళ్ళేమిటోయ్! అసలు వ నకు పిల్లనిచ్చేదెవడు?" అంటారు కాలేజీ విద్యార్థులలో చాలామంది.

వాళ్ల తల్లిదండ్రులు కట్నాలకోసం ఇంటి దగ్గర సిద్ధంగా కూర్చున్నారన్న విషయమూ తెలుసు. తాము ఎలాగైనా పెళ్ళి చేసుకొని తీరతామనీ తెలుసు. కాని... కాని... పెళ్ళి ఎందుకులే? పిల్లనెవడిస్తాడులే? అనటం మామూలయిపోయింది.

పెళ్ళి చేసుకోబోతున్నవాడు పెళ్ళి చేసుకోబోతున్నానని చెప్పటానికి కూడా సిగ్గుపడుతున్నాడు ఈమధ్య. కొందరు తెలివి గలవాళ్లు మాత్రం అతి సులువుగా తప్పించుకుంటున్నారు.

"ఏదో తప్పక" అని ఒక నిముషం రెండు కళ్ళూ మూసుకొని, నోటితో చప్పరించి ఒక చిన్న 'పోజు' వేసి వచ్చేస్తారు. ఎవరికోసమో తాము పెళ్ళి చేసుకుంటున్నట్లు, పైగా పెళ్ళి చేసుకోవటమనేది ఏదో పెద్ద త్యాగకార్యమైనట్లు కూడా భావిస్తారు.

కాలేజీ విద్యార్థులలో కొందరు మరో అడుగు ముందువేసిన వాళ్లున్నారు. ఎవరైనా స్నేహితులు పెళ్ళివిషయం ప్రస్తావిస్తే వింత వింత సమాధానాలు బయటపెడతారు.

"పెళ్ళి ఎప్పుడురా మనకు?"

"పెళ్ళి కూడానా?"

"ఏం? మనిషివేగా?"

"మనిషినేగాని..."

"పెళ్ళి చేసుకోవన్న మాట."

"చేసుకోకూడదనే అనుకుంటున్నానురా."

"బ్రహ్మచారిగా ఉండిపోతావా?"

"పెళ్ళి చేసుకోనంటే బ్రహ్మచారిగా ఉండిపోతానని ఎందుకు అనుకోవాలి?"

ఈ విధంగా సాగుతుంది సంభాషణ. పెళ్ళిమాత్రం చేసుకోడట. బ్రహ్మచారిగానూ ఉండడట. మధ్య దారిలో నడుద్దామని ఊహ. పైగా వీళ్ళందరూ విజ్ఞానులు, అజ్ఞానులందర్నీ ఉద్ధరించేవాళ్ళు. పెళ్లి చేసుకోను, బ్రహ్మచారిగానూ ఉండను అనటానికి బదులు మరోమాట అనవచ్చు.

"వ్యభిచరిస్తాను. వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తాను" అని అనలేదు.

ఆమాత్రం మాట మాట్లాడటానికి ధైర్యం ఉండాలి. చేస్తున్నది చెప్పుకోనేటంటుకు ధైర్యం ఉంటేగా? పోనీ ఆవిధంగా చెప్పుకోలేదనుకుందాము. పోనీ చెప్పినట్లు చేస్తాడా? అంటే అదీలేదు. ఏరోజు కట్నం ఎక్కువ వచ్చేలా ఉంటే ఆరోజు ఓపిల్లను చూసి కట్టేస్తాడు తండ్రి. తండ్రితో చెప్పటానికికూడా ధైర్యం ఉండదు అప్పుడు. ఇటువంటి వాళ్లందరూకూడా పెళ్లి అవసరం లేదనేవాళ్ళే.

* * *

ఈమధ్య ఒక పాతస్నేహితుడిని కలుసుకోవటం తటస్థించింది. సంవత్సరాల క్రితం, బి. ఏ. చదువుకొనేరోజుల్లో నా క్లాసుమేట్ అతను. కుశలప్రశ్నలు వేసుకున్న తరువాత ఒకళ్లనుగురించి ఒకరం వివరాలలోకిపోయాం. మాటల సందర్భంలో అతనే అడిగాడు—

"మరి పెళ్ళయిందా?"

"కాలేదు" అన్నాను.

"ఉద్యోగం చేస్తున్నావన్న మాట."

అవునన్నట్లు తల ఊపాను.

"ఐతే ఫరవాలేదులే" అన్నాడు.

"ఏం?" అన్నాను.

"చదివినందుకు ఉద్యోగం దొరికిందిగా" అన్నాడు.

"నీకు దొరకలేదనుకుంటాను" అన్నాను, అసలు విషయం గ్రహించాననుకొంటూ.

"నాకు ఉద్యోగం దొరకలేదుగాని, చదువుకున్నందుకు ప్రతిఫలం ముట్టింది" అన్నాడు.

నిజం చెప్పాలంటే, అతను మాట్లాడుతున్నదేమిటో నా కర్థంకాలేదు.

"అంటే నా కర్థంకాలేదు" అన్నాను. అతను ఒక్క చిన్ననవ్వు నవ్వాడు. నాకు నవ్వాలో ఏడవాలో తెలిసింది కాదు.

"పదిహేను వేల రూపాయల కట్నం పుచ్చుకున్నాను. చాలదూ?"

"ఇదికూడా ఒక ఉద్యోగమే నంటావు" అన్నాను తెప్పరిల్లి.

"నీ ఉద్యోగంకంటే నాదే మెరుగు. పనీపాటూ చేయ నక్కరలేదు" అన్నాడు అదో విధంగా.

"నేను పెళ్ళికూడ చేసుకొంటే మరో విధంగా లాభమన్న మాట" అన్నాను, నాకు కూడా ఓ పదివేలు కట్నం వస్తుందనే ఉద్దేశ్యంలోపడి. "నీ అదృష్టం బాగుండి, డబ్బున్న మామగారు దొరికితే" అన్నాడు.

నా ప్రాణం చివుక్కుమంది. తరువాత కాస్సేపు ఏవేవో మాట్లాడి ఎవరి దారిన వాళ్లం పోయాం.

ఈమధ్య మరో వింత జరిగినట్లు జ్ఞాపకం. ఒక కాలేజీ హాస్టలులోజరిగిందని చెప్పుకున్నారు.

ఒక విద్యార్థికి ఆ నెలలో అతిథు లెక్కువగా వచ్చారట. 'వార్డెను' గారు పరిశీలించి చూశాడట ఆ వచ్చినవా రెవరైఉంటారోనని. రిజిష్టరులో వ్రాసి ఉందట 'కాబోయే మామగారు' అని. వార్డెను తనలో తను ఒకసారి నవ్వుకొని ఊరుకొన్నాడట.

సంవత్సరం మొదట్లో ప్రారంభమయిన సెషనింగు నేటివరకూ రద్దుకాలేదు కాబట్టి విద్యార్థులు తమ అతిథుల పేర్లు పూర్తి చిరునామాలతోపాటు వ్రాయవలసి వచ్చింది.

సంవత్సరం చివరిరోజుల్లో వార్డెను మళ్ళా ఆ విద్యార్థి ఎకౌంటు తిరగవేయటం సంభవించింది. అతనికి వచ్చిన అతిథులలో మూడువంతులు పెళ్ళిచూపులకు వచ్చినవారే. వార్డెను విద్యార్థిని పిలిచాడు.

"ఏమోయ్! 'గెస్టు' ఛార్జీలు వంద రూపాయలకు పైగా అయినయ్?" అన్నాడట.

"పెళ్ళిచూపులకు వచ్చేవారి సంఖ్య ఎక్కువయిందండి" అన్నాడట.

"ఇకముందు ఇంతమంది అతిథులను రానివ్వడం కష్టం" అన్నాడట.

"మరెల్లాగండీ" అన్నాడట ఆ విద్యార్థి బిక్కముఖం వేసి.

వార్డెను పకిలిగా నవ్వాడట. ఆఫీసులో వాళ్ళందరూ అదేపనిగా నవ్వటంతో విద్యార్థి అక్కడనుంచి త్వరత్వరగా బయటకు పోవలసి వచ్చిందట.

* * *

ఈమధ్య మా చుట్టాలయింట్లో పెళ్ళి ఒకటి జరిగింది. నేను అసలు పెళ్ళిళ్ళకు వెళ్ళేవాడిని కాదు. ఐనా వెళ్లక తప్పిందికాదు. కులాసాగా పేకాడుకున్నాము పగలంతా. పెళ్ళికి వెళ్ళినవాళ్లు అంతకంటే చేసేదేముంది గనుక.

"మరి నీపెళ్ళి ఎప్పుడోయ్?" అన్నాడు ఒక పెద్దమనిషి ముక్కలుకలుపుతూ.

"నేను పెళ్ళిచేసుకోను" అన్నాను.

"ఏం?" అన్నాడు.

"పెళ్లాన్ని పోషించలేను గనుక."

"ఈ పెళ్ళి చేసుకున్న వాళ్ళందరూ పోషించగలమనే ధైర్యంతోనే చేసుకున్నారంటావా?"

"అదంతా నా కనవసరం. నా కాధైర్యం ఉన్ననాడే పెళ్లి చేసుకుంటాను" అన్నాను.

"అందరకూ నీకూ మధ్యఉన్న భేదం ఏమిటి?" అన్నాడు ముఖం చిట్లిస్తూ.

"లేకపోవచ్చు" అన్నాను.

"మరి నువ్వెందుకు పెళ్లి చేసుకోనట్లు"

"నా ఇష్టం గాబట్టి."

కాస్సేపు ఆగి ప్రారంభించాడు ఆయన. ఓ పెద్ద ఉపన్యాసం దంచేశాడు.

"చిన్నప్పుడు మేమూ ఈవిధంగా అన్నవాళ్ళమే నోయ్. నీవే చేసుకుంటావ్ కొన్నాళ్ళు పోయింతరువాత. చిన్నప్పుడు పెళ్ళి చేసుకోనన్న వాళ్ళంతా పెద్దయిన తరువాత అడిగి మరీ చేసుకుంటారు. కుఱ్ఱవాడివి. అనుభవం లేనివాడివి" అనేశాడు.

నేనేం మాట్లాడటానికీ అవకాశం లేకపోయింది. నేనేకాదు. మరెవరైనా ఆ నిముషంలో ఊరుకోవటం తప్ప ఏమిచేయలేరు.

ఈమధ్య పెళ్ళి అవసరంలేదని నొక్కి వక్కాణించిన ఒక రచయిత పెళ్ళి చేసుకోవటం తటస్థించింది.

"ఏమోయ్" అన్నాను.

"ఏమిటి నాయనా!" అన్నాడు చాలా సంసారపక్షంగా.

"మొత్తంమీద పెళ్లి వద్దంటూనే చేసుకున్నావ్" అన్నాను, ఏదో ఒక పెద్ద దొంగను పట్టగలిగాననుకొని.

"ఏంచేయమంటావు చెప్పూ?"

"ఏమంత ప్రాణంమీది కొచ్చిందని చేసుకున్నావ్!" అన్నాను గట్టిగా.

"నీకేం తెలుసు నాయనా! కుర్రవాడివి" అన్నాడు ఆ రచయిత.

ఈ పెళ్ళయిన వాళ్ళకు ఇదో తెగులు. పెళ్ళి కాగానే ఏదో పెద్ద అనుభవం వచ్చిన వాళ్ళలా మాట్లాడతారు. ఎదుటివారు చాలా చిన్నవాళ్ళయినట్లు, ఏమీ తెలియనట్లు తమకంతా తెలిసినట్లు భావిస్తారు. మరి అప్పుడే పెళ్ళయినవాళ్ళు పెళ్లి కానివాళ్ళని చూసే చూపు ఘోరం.

"మరి తమరు ఎందుకు పెళ్ళి చేసుకున్నట్లు" అన్నాను.

"ఏదో ఇంటికి పోగానే కాళ్ళకు నీళ్లు యిస్తుంది. హోటలు భోజనం తప్పుతుంది. ఇత్యాదులు ఎన్నో!" అన్నాడు.

మంచినీళ్లు అందించటంకోసం, ఇళ్ళు ఊడవడం కోసం, గది శుభ్రంగా ఉంచటం కోసం పెళ్ళి చేసుకుంటారని ఎలా అనుకుంటాను? "ఇత్యాదులు" అన్నాడు గదా అని తృప్తి పడుతూ ఆయన కొక నమస్కారం చేసి గూటికి చేరుకున్నాను.